సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

బుధవారం । 16 । అక్టోబర్ । 2024



రైల్వేలో ఎన్నికల నగారా

రైల్వే శాఖలో వన్ ఇండస్ట్రీ, వన్ యూనియన్ గుర్తింపు కోసం ట్రేడ్ యూనియన్ ఎన్నికలు వచ్చాయి. డిసెంబర్‌లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. - 10లో▸



వరంగల్ మార్కెట్‌లో అంతర్గత బదిలీలు

ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ పరిధిలో విధులు నిర్వర్తించే ఉద్యోగులను బదిలీ చేస్తూ మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి నిర్మల ఉత్తర్వులు జారీ చేశారు. - 10లో▸

గరిష్టం/కనిష్టం

$34^0/24^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత వర్షం కురుస్తుంది. సాయంత్రం సమయంలో ఆహ్లాదకరంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

దోషులను కఠినంగా శిక్షించాలి



ఎంజీఎం: పశ్చిమ బెంగాల్‌లోని ఆర్‌జీ కార్ వైద్య కళాశాలలో వైద్య విద్యార్థినిపై దారుణంగా అత్యాచారం, హత్య చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని ఐఎంఏ వరంగల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అన్వర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా ఐఎంఏ ఇచ్చిన పిలుపుమేరకు మంగళవారం ఎంజీఎం ఆవరణలో ఐఎంఏ వరంగల్ ఆధ్వర్యంలో వైద్యులు, జూనియర్ డాక్టర్లు, సీనియర్ రెసిడెంట్ డాక్టర్లు 12 గంటల నిరాహార దీక్ష చేశారు. ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కాళీప్రసాద్‌రావు వైద్యులకు పూలదండలు వేసి దీక్షను ప్రారంభించారు. కార్యక్రమంలో ఐఎంఏ సీనియర్ వైద్యులు విజయ్‌చందర్‌రావు, కస్తూరి ప్రమీల, సుదీప్, భోజ, నాగార్జునరెడ్డి, శ్రావణ్‌కుమార్, వెంకటస్వామి, నరేశ్, అజిత్, ప్రసన్న, రామకృష్ణ, జూడా నాయకులు శ్రీనాథ్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

నాబార్డు సీజీఎంను కలిసిన డీసీసీబీ చైర్మన్ మార్నేని

హన్మకొండ: నేషనల్ బ్యాంక్ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ (నాబార్డు) చీఫ్ జనరల్ మేనేజర్ ఉదయ్ భాస్కర్‌ను తెలంగాణ స్టేట్ కో–ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్, వరంగల్ డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు కలిశారు. మంగళవారం హైదరాబాద్‌లోని నాబార్డు కార్యాలయంలో నూతనంగా సీజీఎంగా నియమితులై బాధ్యతలు చేపట్టిన ఉదయ్ భాస్కర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక విభాగం: సీపీ

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో సిబ్బంది సమస్యల పరిష్కారానికి పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు సీపీ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. ఇటీవల కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది పలు వ్యక్తిగత సమస్యలతో పాటు, శాఖాపరమైన సమస్యలతో బాధపడుతున్నట్లుగా సీపీ దృష్టికి రావడంతో సిబ్బంది సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని విభాగం ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోలీస్ సిబ్బందికి వ్యక్తిగతంగా, శాఖాపరమైన సమస్యలుంటే నోడల్ అధికారి మహిళా ఏఎస్ఐ జ్యోతి ప్రియాంకకు 99486 85494 ద్వారా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. పోలీస్ సిబ్బంది తనను ప్రత్యక్షంగా కలిసి సమస్యలు తెలిపేందుకు ప్రతీ శనివారం కమిషనరేట్‌కు రావొచ్చని సూచించారు.

రేపు జిల్లా స్థాయి సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీలు

వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండ జిల్లా స్థాయి సబ్ జూనియర్స్ బాలబాలికల సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీలను రేపు (బుధవారం) హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి తాబేటి రాజేందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1 జనవరి, 2010 తర్వాత జన్మించిన వారు అర్హులుగా పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన క్రీడాకారులు ఆధార్ కార్డు, పుట్టిన తేదీ సర్టిఫికెట్లతో 17న ఉదయం 9 గంటలకు జేఎన్ఎస్ వద్ద హాజరు కావాలని సూచించారు. పూర్తి వివరాలకు కోచ్ వినయ్‌కుమార్‌ను 98494 14649 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

బిల్లా మహేందర్‌కు గవర్నర్ సన్మానం



విద్యారణ్యపురి: కవి, ఉపాధ్యాయుడు, సామాజిక వేదిక వ్యవస్థాపకుడు బిల్లా మహేందర్ మంగళవారం గవర్నర్ చేతుల మీదుగా సన్మానం అందుకున్నారు. దివ్యాంగుల కోసం స్నేహపూర్వక పర్యావరణం (ఫెడ్) ఆధ్వర్యంలో.. హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో ఇంటర్నేషనల్ వైట్‌కేన్ సేఫ్టీ కార్యక్రమం నిర్వహించారు. ఫెడ్ ఆహ్వానం మేరకు హనుమకొండ జిల్లా నుంచి వెళ్లిన బిల్లా మహేందర్‌ను తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ఇలాంటి గొప్ప కార్యక్రమంలో తనను భాగస్వామిని చేసిన సంస్థ ప్రతినిధులు గంగారం, నాగభూషణ్‌కు మహేందర్ కృతజ్ఞతలు తెలిపారు.

దసరా ధమాకా!


ఆర్టీసీ వరంగల్ రీజియన్ ఆదాయం రూ.28.99 కోట్లు

- తిరిగిన కిలో మీటర్లు 50 లక్షలు
- ఆక్యుపెన్సీ రేషియో 91 శాతం

హన్మకొండ: సద్దుల బతుకమ్మ, దసరా పండుగను ఆర్టీసీ సద్వినియోగం చేసుకుంది. రోజూ నడిచే బస్సులతోపాటు ప్రత్యేక సర్వీసులను నడపడం ద్వారా మరింత ఆదాయం సంపాదించుకుంది. ఈనెల 1 నుంచి 14వ తేదీ వరకు వరంగల్ రీజియన్‌లో టీజీఎస్ ఆర్టీసీ రూ.28.99 కోట్ల ఆదాయాన్ని రాబట్టుకుంది. 14 రోజులపాటు 50 లక్షల కిలోమీటర్లు బస్సులు తిరిగాయి. 91 శాతం ఆక్యుపెన్సీ రేషియో ద్వారా కిలోమీటర్‌కు రూ.58 ఆదాయం పొందింది. బతుకమ్మ, దసరా పండుగకు విద్యాసంస్థలు సెలవులు ఇచ్చినప్పటి నుంచి ప్రయాణికుల రద్దీని బట్టి ప్రైవేట్ వాహనాలకు అవకాశం ఇవ్వకుండా సంస్థ వివిధ రూట్లకు సర్దుబాటు చేసి ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంది.



డిపోల వారీగా ఆదాయం వివరాలు



	హనుమకొండ	జనగామ	వరంగల్-1	వరంగల్-2	మానుకోట	నర్సంపేట	పరకాల	తొర్రూరు	భూపాలపల్లి
ఆదాయం	373.22	338.69	467.24	393.18	203.02	284.87	223.94	329.99	285.47
కిలోమీటర్లు	6.72	6.16	7.82	7.16	3.46	4.92	3.79	5.22	4.75
ఈపీకే	55.50	54.97	59.76	54.95	58.61	57.89	59.15	63.27	60.07
ఓఆర్	81	94	83	86	103	96	98	104	97

- ఆదాయం (రూ.లక్షల్లో) • తిరిగిన కిలోమీటర్లు (లక్షల్లో)
- ఎర్నింగ్స్ పర్ కిలోమీటర్ (ఈపీకే) రూ.లలో • ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్) శాతంలో

అత్యధిక ఆదాయం వరంగల్-1 డిపో

- పండుగ రోజుల్లో వరంగల్-1 డిపోకు అత్యధికంగా రూ.467.24 లక్షలు ఆదాయం వచ్చింది.
- అతి తక్కువగా మహబూబాబాద్ డిపో రూ.203.02 లక్షలు ఆదాయం సాధించింది.
- వరంగల్ రీజియన్‌లోని 9 డిపోల్లో ఆక్యుపెన్సీ రేషియోలో తొర్రూరు డిపో 104 శాతంతో అగ్రభాగాన నిలవగా.. మహబూబాబాద్ డిపో 103 శాతంతో ద్వితీయ స్థానంలో నిలిచింది.
- హనుమకొండ 81శాతం ఆక్యుపెన్సీ రేషియోతో చివరి స్థానంలో ఉంది.
- తొర్రూరు డిపో కిలోమీటర్‌కు రూ.63.27 ఆదాయం రాబట్టి కిలో మీటర్ లెక్కన వరంగల్ రీజియన్‌లో అగ్రభాగంలో నిలిచింది.
- భూపాలపల్లి డిపో కిలోమీటర్‌కు రూ.60.07 ఆదాయాన్ని పొంది రెండో స్థానంలో నిలిచింది.
- వరంగల్-1 డిపో 7.82 లక్షల కిలో మీటర్లు బస్సులు నడిపి మొదటి స్థానంలో నిలవగా.. 7.16 లక్షల కిలో మీటర్లు బస్సులు నడిపి వరంగల్-2 రెండో స్థానంలో నిలిచింది.

నీరు.. జనం బేజారు

ప్రజలకు సరఫరా చేసే నీరు కలుషితం

- మామూళ్ల మత్తులో ఇంజనీర్లు
- ఆలమ్, క్లోరిన్ కొనుగోల్‌మాల్
- గ్రేటర్ వరంగల్ ఫిల్టర్ బెడ్లలో అక్రమాలు, అవినీతి

వరంగల్ అర్బన్: అవినీతికి కాదేది అనర్హం అని నిరూపిస్తున్నారు బల్దియా ఇంజనీర్లు, సిబ్బంది. గ్రేటర్ వరంగల్ వాసులకు స్వచ్ఛ తాగునీటిని అందించేందుకు ఏర్పాటు చేసిన శుద్ధీకరణ చర్యల్లోనూ అవినీతికి పాల్పడుతున్నారు. నీటి శుద్ధి పేరిట ఏటా రూ.2.50 కోట్ల మేరకు వెచ్చిస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో రంగుమారిన నీరే సరఫరా అవుతోంది. ధర్మసాగర్ జలాశయం నుంచి ఫిల్టర్‌బెడ్ల ద్వారా శుద్ధి చేసి రిజర్వాయర్ల ద్వారా నల్లాలకు నీటిని సరఫరా చేస్తుంటారు. ఈక్రమంలో పెద్ద మొత్తంలో రసాయనాలు సమ్మేళనం చేయాల్సి ఉంటుంది. అయినప్పటికీ నీరు ఎందుకు శుద్ధి కావడం లేదనే ప్రశ్నలు ప్రజల నుంచి ఉత్పన్నమవుతున్నాయి. నీటి శుద్ధికి ఉపయోగించే ఆలమ్, క్లోరిన్, గ్యాస్, బ్లీచింగ్ పౌడర్ వినియోగంలో నిబంధనలు పాటించిన దాఖలాలు ఎక్కడా కనిపించడం లేదు. నీటి పేరుతో ఫిల్టర్‌బెడ్‌లలో రూ.లక్షల సొమ్ము పక్కదారి పడుతోంది. కొనుగోలు చేసేదానికి.. వినియోగించే దానికి వ్యత్యాసమే కనిపించని పరిస్థితి.

అంతా మాయ..

ఫిల్టర్‌బెడ్‌లలో రికార్డుల్లో చూపిన గణాంకాలన్నీ తప్పుల తడకగానే కనిపిస్తాయి. రూ.లక్షల కేజీల్లో కొనుగోలు చేస్తున్నట్లుగా చూపి తక్కువ మొత్తమే కొనుగోలు చేస్తుంటారు. మార్కెట్ ధరకు కిలోకు ఒకటి రెండు రూపాయలు తేడానే ఉంటోంది. ఆలమ్, క్లోరిన్, సిలిండర్లు సరఫరా సమయంలో ఎంత ఇండెంట్ వచ్చిందో చూసే నాథుడు ఉండకపోవడం వల్ల ఇంజనీర్లు, అధికారులు కుమ్మక్కై డబ్బులు నొక్కేస్తున్నారనే విమర్శలున్నాయి. కాగా.. గ్రేటర్ వరంగల్‌లో అవినీతి బాగోతం బహిరంగంగానే నడుస్తోందనే చర్చ జరుగుతోంది. నీటి శుద్ధికి రసాయనాల పేరిట ఏటా రూ. రూ.3 కోట్లు వెచ్చిస్తున్నారు. ఇందులో రూ.కోటి వరకు ఇతరుల జేబుల్లోకి వెళ్తోందనేది బహిరంగ రహస్యమే..

పత్తా లేని ప్రధాన పరికరం..

తాగునీటి శుద్ధిలో ఆలమ్, క్లోరిన్ తదితర రసాయనాలు ఎంత మేరకు కలపాలనేది ఒక పరికరాన్ని ఉపయోగించి తెలుసుకుంటారు. ప్రస్తుతం ఈ పరికరం గ్రేటర్ పరిధిలో కనిపించడం లేదు. గతంలో ఉపయోగించినప్పటికీ ఇప్పుడీ పరికరాలు పని చేయకపోవడంతో దాదాపు అన్ని చోట్లా మూలన పడ్డాయి. కనీసం కొత్తవి కొనాలనే దిశగా సైతం పాలకులు, అధికారులు ఆలోచన చేయడం లేదు. ఈపరికరం లేని కారణంగా తక్కువ ఉపయోగిస్తూ సొమ్ము కాజేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కాగా.. గ్రేటర్ పరిధిలో నీటి శుద్ధికి సంబంధించిన ప్రయోగశాలలు లేవు. ఫలితంగా కలుషిత నీరు సరఫరా అవుతుండడంతో నగరంలోని 50 శాతం మంది ప్రజలు మినరల్ వాటర్ కొనుక్కుని తాగుతున్నారు.



ఈఫొటోలో కనిపిస్తున్న రంగుమారిన నీరు హనుమకొండ జ్యోతి కాలనీలో నల్లా నుంచి సరఫరా అయినది. ఈ సమస్య ఒక్క జ్యోతి కాలనీది మాత్రమే కాదు. ఎన్జీఓస్ కాలనీ, విజయ్ పాల్ కాలనీ, వరంగల్‌లోని దేశాయిపేట, వీవర్స్ కాలనీ, ఎంహెచ్ నగర్, పద్మానగర్, ఎల్లంబజార్ తదితర ప్రాంతాల్లోనూ ఇదే దుస్థితి. నల్లాల ద్వారా వచ్చే నీరు బురద, మట్టితో ఉంటోందని, ఈనీళ్లు ఎలా తాగాలని ఆయా కాలనీలవాసులు ఇటీవల ఆందోళన చేశారు. ఈ ఘటన అనంతరం స్పందించిన మేయర్ గుండు సుధారాణి దేశాయిపేట ఫిల్టర్‌బెడ్‌ను సందర్శించారు. నీటి నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు. అయినప్పటికీ సమస్య అలాగే ఉందని పలు కాలనీల వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



దేశాయిపేట ఫిల్టర్ బెడ్‌లో రంగుమారిన నీళ్లు

రంగుమారిన నీళ్లు వస్తున్నాయి..



నెల రోజులుగా నల్లాల నుంచి వచ్చే నీరు రంగుమారి, దుర్వాసనతో వస్తోంది. మున్సిపాలిటీ లైన్‌మెన్‌కు చెప్పినా పట్టించుకోవడం లేదు. నల్లా బిల్లులు వసూలు చేసినప్పుడు కనీసం నీళ్లు శుద్ధి చేసి పంపించాలి కదా.

\- నల్లా రేణుక, ఓఎస్ ఆర్ నగర్

మినరల్ వాటర్ తాగుతున్నాం..



నల్లా నీళ్లు రంగుమారడం వల్ల భయంతో మినరల్ వాటర్ కొని తాగుతున్నాం. పైపులైన్ల లీకేజీలే కారణమో.. లేక సరిగ్గా పరిశుభ్రత పాటించడం లేదో తెలియదు. కానీ.. నల్లా నీళ్లు సబ్బు నీళ్ల మాదిరిగా నురగలతో వస్తున్నాయి.

\- రంగ రాజు విజయ, రఘునాథ్‌నగర్

పరీక్షలు నిర్వహించాం..

రామన్నపేట ప్రాంతంలోని పలు ప్రాంతాల్లో తాగునీరు రంగు మారడంపై ఫిర్యాదులు వచ్చాయి. క్షేత్రస్థాయిలో నిర్ధారణ పరీక్షలు నిర్వహించాం. సమస్య లేకుండా చర్యలు తీసుకున్నాం. ప్రస్తుతం నల్లాల ద్వారా తాగునీరు బాగానే సరఫరా అవుతోంది. ఆయా కాలనీల ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

\- ప్రవీణ్ చంద్ర, బల్దియా ఇన్‌చార్జ్ ఎస్‌ఈ

కొత్త టీచర్లకు కౌన్సెలింగ్



కొత్త టీచర్లకు పోస్టింగ్ ఉత్తర్వులు అందజేస్తున్న అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి, డీఈఓ వాసంతి

విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లాలోని కొత్త టీచర్లకు మంగళవారం పాఠశాలల్ని కేటాయించేందుకు కౌన్సెలింగ్ నిర్వహించారు. మ్యాన్యువల్‌గా ఈప్రక్రియను ఈనెల 15న ఉదయం 10గంటలకు నిర్వహిస్తామని అధికారులు ముందుగా ప్రకటించారు. దీంతో వివిధ ప్రాంతాల నుంచి అభ్యర్థులు వచ్చారు. వాయిదా వేసినట్లు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నుంచి సమాచారం రావడంతో డీఈఓ వాసంతి ఇతర విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది అభ్యర్థులకు తెలియజేశారు. దీంతో.. ఇక కౌన్సెలింగ్ ప్రక్రియ ఉండబోదని అభ్యర్థులు వెనుదిరిగారు. మళ్లీ మధ్యాహ్నం 2గంటల నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించాలనే సంబంధిత ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడంతో డీఈఓ కార్యాలయం నుంచి సంబంధిత అభ్యర్థులకు మెసేజ్‌లు పంపారు. దీంతో ఆయా అభ్యర్థులు కలెక్టరేట్‌కు చేరుకున్నారు. కాన్ఫరెన్స్ హాల్ వద్ద కారిడార్‌లో వారికి కనీసం కుర్చీలు కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో అభ్యర్థులు కిందే కూర్చున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు కౌన్సెలింగ్ ప్రారంభమైంది.

పోస్టింగ్ ఆర్డర్ల అందజేత..

స్కూల్ అసిస్టెంట్లు, లాంగ్వేజ్ పండిట్లు, పీఈటీలు, ఎస్జీటీల కౌన్సెలింగ్ ప్రక్రియ మంగళవారం రాత్రి 8 గంటలకు ముగిసింది. తర్వాత 169 మంది టీచర్లకు పోస్టింగ్ ఆర్డర్లు కూడా జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీఈఓ వాసంతి అందజేశారు. ఈనెల 16న టీచర్లు పాఠశాలల్లో చేరనున్నారు. ఇందులో డీఈఓ వాసంతి, జెడ్పీసీఈఓ విద్యాలత, జిల్లా క్వాలిటీ కో–ఆర్డినేటర్ ఎ.శ్రీనివాస్, జీసీడీఓ సునీత, పీజీహెచ్‌ఎం రాధ తదితరులున్నారు.

వరంగల్ జిల్లాలో 80 మంది

కాళోజీ సెంటర్: వరంగల్ జిల్లాలో డీఎస్సీ–2024 ద్వారా నియామకమైన నూతన ఉపాధ్యాయులకు మంగళవారం పోస్టింగ్ (పాఠశాలల కేటాయింపు) కోసం కౌన్సెలింగ్ నిర్వహించారు. జెడ్పీహాల్‌లో వివిధ కేటగిరీలకు చెందిన 80 మందికి పోస్టింగ్ ఇచ్చినట్లు డీఈఓ మామిడి జ్ఞానేశ్వర్ తెలిపారు. మిగిలిన వారికి బుధవారం ఉదయం 10 గంటలకు జెడ్పీ హాల్‌లో కొనసాగుతుందని పేర్కొన్నారు. ఏఎంఓ ఉండ్రాతి సృజన్‌తేజ, సీఎంఓ కుడికాల సుభాష్, డీసీఈబీ కార్యదర్శి గారె కృష్ణమూర్తి, సూపరింటెండెంట్ బాబ్జీ, ఏఎస్ఓ వేణుగోపాల్, ఏపీఓ రాజ్‌గోపాల్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్లు ఎస్‌బీ శ్రీనివాస్, షకీల్ అహ్మద్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద



మాట్లాడుతున్న వరంగల్ కలెక్టర్ సత్య శారద

కాళోజీ సెంటర్: ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందించాలని వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు. కలెక్టరేట్‌లో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ అధ్యక్షతన మంగళవారం జిల్లాస్థాయి విజిలెన్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లాలో 2,66,664 మంది లబ్ధిదారులకు 509 రేషన్ షాపుల ద్వారా సరుకులు పంపిణీ చేస్తున్నట్లు పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ సంధ్యారాణి తెలిపారు. 919 అంగన్‌వాడీ సెంటర్ల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి రాజమణి వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ నిత్యావసరాల్లో అవకతవకలకు పాల్పడిన ఏడుగురు రేషన్ డీలర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు రేషన్ దుకాణాలను సీజ్ చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌డీఓ కౌసల్యాదేవి, భాగ్యలక్ష్మి, సౌజన్య, రేషన్ డీలర్ల సంఘం నాయకులు దామోదర్, రాంచంద్రు పాల్గొన్నారు.

18న దిశ సమావేశం

వరంగల్ జిల్లా దిశ (జిల్లా అభివృద్ధి సహకార, మానిటరింగ్ కమిటీ)సమావేశం మహబూబాబాద్ ఎంపీ అధ్యక్షతన ఈనెల 18న ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ డాక్టర్ సత్య శారద మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు ఈ సమావేశానికి హాజరు కావాలని ఆమె కోరారు.

పత్తి కొనుగోళ్లకు ఏర్పాట్లు చేయండి

- హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య
- అధికారులు, జిన్నింగ్ మిల్లుల యజమానులతో సమావేశం



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

హన్మకొండ అర్బన్: జిల్లాలో పత్తి కొనుగోళ్ల ప్రక్రియకు సంబంధించి అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లాలో పత్తి కొనుగోలు ప్రక్రియకు సంబంధించి ఆయా శాఖల అధికారులు, జిన్నింగ్ మిల్లుల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఈనెల మూడో వారం నుంచి పత్తి కొనుగోళ్లు ప్రారంభించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి అనురాధ, జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్, సీసీఐ వరంగల్ మేనేజర్ జితేందర్, ఎంపీఐ వేణుగోపాల్, ఇతర శాఖల అధికారులు, జిన్నింగ్ మిల్లుల యజమానులు, తదితరులు పాల్గొన్నారు.

చెకుముకి టాలెంట్ టెస్ట్ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

విద్యార్థుల్లో సైన్స్‌పై అవగాహన పెంపొందించడంతో పాటు వారిలోని సృజనాత్మక శక్తిని వెలికి తీసేందుకు చెకుముకి టాలెంట్ టెస్ట్ ఎంతో ఉపయోగపడుతుందని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించనున్న ' చెకుముకి టాలెంట్ టెస్ట్ సంబరాల–2024 ' వాల్‌పోస్టర్‌ను మంగళవారం కలెక్టర్ ప్రావీణ్య ఆవిష్కరించారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కాజీపేట పురుషోత్తం, చెకుముకి సంబరాలు–2024 రాష్ట్ర బాధ్యులు, నిట్ విశ్రాంత అచార్యులు కె.లక్ష్మారెడ్డి, జాతీయ అవార్డు గ్రహీత పరికిపండ్ల వేణు, విద్యా విభాగం కన్వీనర్ పాల కుమారస్వామి, హనుమకొండ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, జేవీవీ సెక్రటరీ డాక్టర్ శ్యామల శ్రీధర్ రెడ్డి, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

నేడు కాజీపేటలో రైల్వే గ్రీవెన్స్ క్యాంప్

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే కమ్యూనిటీ హాల్‌లో బుధవారం రైల్వే కార్మికుల కోసం సౌత్ సెంట్రల్ రైల్వే సికింద్రాబాద్ డివిజన్ అధికారులు రైల్వే స్టాఫ్ గ్రీవెన్స్ క్యాంప్‌ను ఏర్పాటు చేసినట్లు మంగళవారం అధికారులు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ గ్రీవెన్స్ క్యాంప్ ఉంటుందని పేర్కొన్నారు. రైల్వే కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బీసీ గురుకులాలకు తాళం!

అద్దె చెల్లించడం లేదని గేట్లకు తాళం వేసిన యజమానులు

- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 36 బీసీ గురుకులాలు అద్దె భవనాల్లోనే
- ఏడు మాత్రమే సొంత భవనాల్లో
- మార్చినుంచి ఇప్పటి వరకు చెల్లించని అద్దె

సాక్షిప్రతినిధి, వరంగల్/విద్యారణ్యపురి: మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకులాలకు తాళం పడింది. ఇప్పటికే పలు సమస్యలతో కొట్టుమిట్టాడుతుండగా మరోవైపు అద్దె చెల్లించకపోవడం.. దసరా సెలవులు ముగిసి మంగళవారం నుంచి విద్యార్థుల రాక ప్రారంభంకావడంతో మొదటి రోజే అద్దెభవనాల యజమానులు పాఠశాల గేట్లకు తాళం వేసి నిరసన తెలిపారు. పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులు, విద్యార్థులు గంటల తరబడి గేటు బయటే పడిగాపులు కాశారు. కొన్నిచోట్ల ప్రిన్సిపాళ్లు యజమానులకు నచ్చజెప్పినట్లు తెలుస్తోంది.

అద్దె భవనాల్లోనే..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 43 వరకు మహాత్మాజ్యోతిరావు పూలే బీసీ గురుకులాలు ఉన్నాయి. ఇందులో ఏడు గురుకులాలకు ప్రభుత్వ భవనాలు ఉండగా, మిగతా 36 అద్దె భవనాల్లో కొనసాగిస్తున్నారు. వీటికి ప్రతీనెల రూ.74లక్షలనుంచి రూ.75 లక్షల వరకు ప్రభుత్వం అద్దె చెల్లించాల్సి ఉంటుంది. ఈ ఏడాది మార్చి నుంచి ఇప్పటివరకు అద్దె చెల్లించడం లేదు. ఆయా యాజమాన్యాలు తమకు అద్దెబిల్లులు చెల్లించాలని పలుమార్లు కోరినప్పటికి ప్రభుత్వం నుంచి విడుదల కాకపోవడంతో దసరా సెలవుల అనంతరం పాఠశాలలు తెరిచే రోజు గురుకులాల గేట్లకు తాళాలు వేసి నిరసన తెలిపారు. ఈ విషయమై అద్దెభవనాల యాజమాన్యాల అసోసియేషన్ అధ్యక్షుడితో ఉమ్మడి జిల్లా ఆర్‌సీఓ ఎం.రాజ్‌కుమార్ ఫోన్‌లో మాట్లాడారు. అద్దె బకాయిలు చెల్లించేందుకు సంబంధిత ఉన్నతాధికారులు యత్నిస్తున్నారని, బిల్లులు వస్తాయని, సహకరించాలని తెలియజేసినట్లు రాజ్‌కుమార్ 'సాక్షి'కి తెలిపారు. ఉన్నతాధికారులు కూడా సంబంధిత అద్దె యాజమాన్యాలతో మాట్లాడినట్లు సమాచారం. ఆ తరువాత యజమానులు గేట్లకు తాళాలు తీసినట్లు తెలిసింది.

డిగ్రీ కళాశాలలు ఇలా..

బీసీ గురుకులాల్లో మహబూబాబాద్ జిల్లాలో రెండు డిగ్రీ కళాశాలలు, జనగామలో ఒకటి, భూపాలపల్లిలో ఒకటి అద్దె భవనాల్లో ఉన్నాయి. హనుమకొండ జిల్లా కాజీపేటలో మహిళలకు లా కాలేజీ, ములుగు జిల్లాకు మంజూరైన డిగ్రీ కాలేజీ కూడా లా కాలేజీ సొంత భవనంలోనే నడుపుతున్నారు.



వరంగల్ ఉర్సు గుట్ట గురుకుల (బాలికల) పాఠశాల, కళాశాల గేటుకు తాళం వేసిన యజమాని కుమారస్వామి, గేటు వద్ద నిరీక్షిస్తున్న సిబ్బంది, ఉపాధ్యాయులు

జిల్లాల వారీగా బీసీ గురుకులాలు ఇలా..

జిల్లా	మొత్తం	సొంత భవనాలు	అద్దె భవనాలు
హనుమకొండ	12	04	08
వరంగల్	07	00	07
జనగామ	07	01	06
ములుగు	03	01	02
జేఎస్‌భూపాలపల్లి	05	02	03
మహబూబాబాద్	06	00	06

గేటు బయటే విద్యార్థులు, ఉపాధ్యాయులు - 10లో▸

20న ఉమ్మడి జిల్లా స్థాయి ఖోఖో ఎంపికలు

వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఈ నెల 20వ తేదీన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి జూనియర్ బాలబాలికల ఖోఖో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఖోఖో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి తోట శ్యాంప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాకారుల ఎత్తు, బరువు, వయసు కలుపుకుని 250 పాయింట్లు దాటొద్దని, నవంబర్ 11, 2006 తర్వాత జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు ఉదయం 10 గంటలకు జేఎన్ఎస్‌లోని ఖోఖో స్టేడియం వద్ద ఆధార్, పుట్టిన తేదీ సర్టిఫికెట్లతో ఖోఖో కోచ్ రాజారపు రమేశ్‌ను సంప్రదించాలని సూచించారు. ఇందులో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులతో కూడిన జిల్లా జట్టు ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు మహబూబ్‌నగర్‌లో జరుగనున్న రాష్ట్ర స్థాయిలో పాల్గొంటుందని తెలిపారు.

యాంటీ డ్రగ్స్ టీమ్, పోలీసుల తనిఖీలు



తనిఖీలు చేస్తున్న పోలీసులు

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే స్టేషన్‌లో మంగళవారం యాంటీ డ్రగ్ టీమ్, కాజీపేట పోలీసులు సంయుక్తంగా నార్కోటిక్ డాగ్ సహాయంతో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాంలు, ప్రయాణికులు వేచి ఉండే గదులు, అనుమానాస్పద ప్రయాణికులు, వారి బ్యాగులను తనిఖీ చేశారు. కాజీపేట సీఐ సుధాకర్‌రెడ్డి, ఎస్సైలు లవన్‌కుమార్, నవీన్, యాంటీ డ్రగ్స్ టీమ్ ఇన్‌స్పెక్టర్ జె.సురేశ్, ఆర్ఎస్సైలు పూర్ణచంద్రారెడ్డి, మనోజ్‌రెడ్డి, నాగరాజు, ఆర్పీఐ శివకేశవులుపాల్గొన్నారు.

పండుగకు వచ్చి ప్రాణం తీసుకున్నాడు..

- క్షణికావేశంలో యువకుడి ఆత్మహత్య
- మహబూబాబాద్‌లో ఘటన

మహబూబాబాద్ రూరల్ : దసరా పండుగకు ఇంటికి వచ్చిన ఓ యువకుడు క్షణికావేశంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన సోమవారం రాత్రి మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని నందమూరినగర్ కాలనీకి చెందిన మంజుల సురేశ్ (30), భార్య కల్యాణి, కుమారుడు, కుమార్తెతో కలిసి బతుకుదెరువు నిమిత్తం హైదరాబాద్ వెళ్లాడు. ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో దసరా సందర్భంగా ఇంటికి వచ్చాడు. పండుగ అనంతరం హైదరాబాద్ వెళ్దామని భార్య కల్యాణి చెప్పగా మద్యం మత్తులో ఉన్న సురేశ్ తరువాత వెళ్దామని చెప్పాడు. తల్లి సత్తెమ్మ, భార్య కల్యాణి.. మద్యం ఎందుకు సేవిస్తున్నావని మందలించగా, మీరు వెళ్లండి నేను తరువాత వస్తానని చెప్పాడు. దీంతో కల్యాణి తన కుమారుడు, కుమార్తెతో కలిసి హైదరాబాద్ వెళ్లడానికి రైల్వే స్టేషన్ చేరుకుంది. బయట ఉన్న తల్లి సత్తెమ్మ ఇంట్లోకి వచ్చి చూడగా సురేశ్ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై మృతుడి తల్లి సత్తెమ్మ ఫిర్యాదు మేరకు ఏఎస్సై జోవెల్ ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించి శవ పంచనామా జరిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు.

గేటు బయటే విద్యార్థులు, ఉపాధ్యాయులు

అద్దె చెల్లించలేదని గురుకులాల గేట్లకు తాళం | **భవనాల యజమానుల నిరసన**

తొర్రూరు/ఖానాపురం/చెన్నారావుపేట/దుగ్గొండి/గూడూరు/రేగొండ/ఖిలావరంగల్/భూపాలపల్లి అర్బన్/ములుగు రూరల్: : గురుకులాల భవనాలకు రాష్ట్ర ప్రభుత్వం అద్దె బకాయిలు చెల్లించకపోవడంతో మంగళవారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణంలోని మహాత్మా జ్యోతిరావుపూలే బీసీ బాలుర గురుకులం, మైనార్టీ బాలికల గురుకులం, నాంచారి మడూరులోని బీసీ బాలుర డిగ్రీ గురుకుల కళాశాల గేట్లకు యజమానులు తాళాలు వేసి నిరసన తెలిపారు. దీంతో విధులకు హాజరయ్యేందుకు వచ్చిన ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఆరుబయటే నిరీక్షించారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర అధ్యక్షుడు అనుమాండ్ల దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ 8 నెలలుగా ప్రభుత్వం అద్దె చెల్లించలేదని, పాఠశాల భవనాలకు నెలకు రూ.3 లక్షలు, కళాశాల భవనాలకు రూ. 4.50 లక్షలు చొప్పున చెల్లించాల్సి ఉందన్నారు. అనంతరం అధికారుల హామీ మేరకు భవనాల యజమానులు గురుకులాల గేట్లు తెరిచారు.

- గూడూరు మండలంలోని మర్రిమిట్ట శివారు మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల గురుకుల విద్యాలయానికి మంగళవారం భవన సముదాయ యజమాని నితిన్ తాళం వేశారు. సమాచారం అందుకున్న గురుకుల విద్యాలయాల సెక్రటరీ.. వచ్చే నెల 4వ తేదీ లోపు అద్దె డబ్బులు చెల్లిస్తామని ఫోన్‌లో హామీ ఇచ్చారు.
- వరంగల్ జిల్లా ఖానాపురం మండలంలోని ఐనపల్లిలోని జ్యోతిరావుపూలే పాఠశాలకు యజమాని మంగళవారం తాళం వేశారు. దీంతో మధ్యాహ్నం వరకు ఉపాధ్యాయులు లోపలికి వెళ్లకుండా ఆగిపోయారు.
- దుగ్గొండి మండలం గిర్నిబావిలోని మహాత్మా జ్యోతిరావుపూలే గురుకుల పాఠశాల గేటుకు యజమానులు బైరెడ్డి రాజేందర్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి తాళం వేశారు.
- దుగ్గొండి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల.. చెన్నారావుపేట మండల కేంద్రంలోని సిద్దార్థ గురుకుల హైస్కూల్ భవనంలో కొన్నేళ్లుగా నడుస్తోంది. అంతేకాకుండా ఇందులోనే హాస్టల్ కూడా నడుస్తోంది. అద్దె డబ్బులు చెల్లించకపోవడంతో భవనానికి తాళం వేసినట్లు యజమాని గోపాల్‌రెడ్డి తెలిపారు.
- జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలోని లింగాల మహాత్మా గాంధీ జ్యోతిరావు పూలే బాలికల హాస్టల్ భవనానికి 8 నెలలుగా అద్దె చెల్లించక పోవడంతో యజమానికి గేటుకు తాళం వేశారు.



చెన్నారావుపేట : భవనానికి తాళం వేస్తున్న యజమాని కంది గోపాల్‌రెడ్డి



గూడూరు: మహాత్మా జ్యోతిరావుపూలే గురుకులానికి తాళం వేస్తున్న భవన యజమాని నితిన్

- అద్దె బకాయిలు చెల్లిచాలని డిమాండ్ చేస్తూ వరంగల్ ఉర్సు గుట్ట వద్ద మహాత్మా జ్యోతిరావుపూలే బాలికల గురుకుల పాఠశాల, కళాశాల భవనానికి తాళం వేశారు. దీంతో కళాశాల సిబ్బంది, ప్రధానోపాధ్యాయులు బయటే నిరీక్షించారు.
- జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని సుభాశ్‌కాలనీలోని మైనారిటీ గురుకుల పాఠశాల గేట్‌కు భవన యాజమాని నాగుల దేవేందర్‌రెడ్డి తాళం వేశారు. ఉదయం 8గంటలకే తాళం వేయడంతో అధ్యాపకులు సాయంత్రం వరకు గురుకుల పాఠశాల ఎదుటే చెట్ల కింద వేచి ఉన్నారు. విద్యార్థులు తిరిగి ఇంటికి వెళ్లారు.
- ములుగు మండలం మల్లంపల్లిలో అద్దెకు కొనసాగుతున్న ఏటూరునాగారానికి చెందిన గురుకుల పాఠశాలకు యజమాని తాళం వేశారు. సాయంత్రం వరకు సమస్య పరిష్కారం కాకపోవడంతో విద్యార్థులు తిరిగి ఇళ్లకు వెళ్లిపోయారని పాఠశాల ప్రిన్సిపాల్ అంకయ్య తెలిపారు.

రైల్వేలో ఎన్నికల నగారా

- డిసెంబర్ 4, 5, 6వ తేదీల్లో సీక్రెట్ బ్యాలెట్ ఎన్నికలు
- నిమినేషన్ల ప్రారంభం
- కాజీపేటలో 4 పోలింగ్ సెంటర్లు

కాజీపేట రూరల్: రైల్వే శాఖలో ట్రేడ్ యూనియన్ ఎన్నికలు వచ్చాయి. రైల్వేశాఖలో వన్ ఇండస్ట్రీ వన్ యూనియన్ గుర్తింపు కోసం రైల్వే ట్రేడ్ యూనియన్ ఎన్నికలు జరుగనున్నాయి. 2013లో రైల్వే ఇండస్ట్రీ వన్ యూనియన్ ఎన్నికలు జరిగాయి. ప్రతి ఆరేళ్లకోసారి జరిగే ఈ ఎన్నికలు 2019లో జరగాల్సి ఉంది. అనివార్య కారణాల వల్ల ఎన్నికలు జరగలేదని రైల్వే నాయకులు తెలిపారు. తిరిగి రైల్వే బోర్డ్ 2024 డిసెంబర్‌లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు నాయకులు తెలిపారు. గత ఎన్నికల్లో రైల్వే మజ్దూర్ యూనియన్, రైల్వే ఎంప్లాయిస్ సంఘ్, డీఎంఆర్‌కేఎస్, ఆర్ఎంయూ ట్రేడ్ యూనియన్లు పోటీ చేశాయని, ఈ సారి కూడా ఈ నాలుగు ట్రేడ్ యూనియన్లు పోటీ చేసే అవకాశం ఉందని రైల్వే నాయకులు తెలిపారు. కాగా.. కాజీపేట జంక్షన్ పరిధిలో అన్ని రైల్వే స్టేషన్లలో వన్ ఇండస్ట్రీ వన్ యూనియన్ ఎన్నికల వేడి మొదలైంది. ఆయా ట్రేడ్ యూనియన్ల నాయకుల హడావిడితో అటు రైల్వే నాయకుల్లో, ఇటు కార్మికుల్లో ఉత్సాహం జోరందుకుంది.

ఎన్నికల షెడ్యూల్ ఇలా..

అక్టోబర్ 1 ప్రారంభమైన నామినేషన్ల ప్రక్రియ ఈనెల 25వ తేదీ వరకు కొనసాగుతుంది. నవంబర్ 11న స్క్రూటినీ, అదే రోజు నామినేషన్ డిస్‌ప్లే ఉంటుంది. నవంబర్ 14న నామినేషన్ విత్‌డ్రా. అదే రోజు నామినేషన్ ఫైనల్ లిస్ట్, డిసెంబర్ 4, 5, 6వ తేదీల్లో ఎన్నికలు జరగనున్నాయి. 12వ తేదీన ఎన్నికల కౌంటింగ్, ఫలితాలు ఉంటాయి.

కాజీపేటలో 4 ఎన్నికల కేంద్రాలు

కాజీపేట జంక్షన్ పరిధిలో రైల్వే వన్ ఇండస్ట్రీ వన్ యూనియన్ ఎన్నికలకు సంబంధించి 4 పోలింగ్ కేంద్రాలు రైల్వే కార్మికుల కోసం ఏర్పాటు చేసినట్లు రైల్వే నాయకులు తెలిపారు. జంక్షన్ పరిధిలో వివిద విభాగాల్లో పని చేస్తున్న సుమారు 3 వేల మంది కార్మికులు ఈ ఎన్నికలో పాల్గొని తమ ఓటును వినియోగించుకోనున్నట్లు తెలిపారు. కాజీపేటలో రైల్వే డీజిల్ లోకోషెడ్, ఎలక్ట్రిక్ లోకోషెడ్, రైల్వే ఇంజనీరింగ్ ట్రెనింగ్ సెంటర్, పీడబ్ల్యూఐ నార్త్ కార్యాలయం, వరంగల్ రైల్వే స్టేషన్‌లో ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు నాయకులు తెలిపారు.

ఎక్సైజ్ శాఖకు.. దసరా కిక్కు

- రూ.142 కోట్ల విలువైన మద్యం తాగేశారు

కాజీపేట అర్బన్ : దసరా పండుగకు మందుబాబులు ఎక్సైజ్‌శాఖకు మంచి కిక్కు ఇచ్చారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న 294 వైన్స్, 134 బార్‌లలో దసరా పండుగకు 1,29,740 పెట్టెల మద్యం, 2,53,666 పెట్టెల బీర్లను తాగేశారు. ఎక్సైజ్‌శాఖ ద్వారా ఖజానాకు రూ.142 కోట్ల ఆదాయాన్ని సమకూర్చారు. కాగా, గతేడాది రూ.94 కోట్ల ఆదాయం దసరా పండుగకు రాగా, ఈ ఏడాది రూ.142 కోట్ల ఆదాయంతో ఎక్సైజ్‌శాఖ రికార్డును మందుబాబులు బ్రేక్ చేశారు.

మూడుశాతం రిజర్వేషన్ అమలు చేయాలి

- ఎమ్మెల్సీ అమీర్ అలీఖాన్

హన్మకొండ చౌరస్తా: మహానేత, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ముస్లింలకు 3 శాతం రిజర్వేషన్ అమలు చేయడం వల్ల అనేక మంది ఉద్యోగాలు పొందారని, ప్రస్తుత ప్రభుత్వం ఆ రిజర్వేషన్ అమలు చేయాలని ఎమ్మెల్సీ అమీర్ అలీఖాన్ అన్నారు. హనుమకొండ రాయపురలోని జక్రియా ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం మైనారిటీ ఇంటలెక్చువల్ ఫోరం, ముస్లిం వెల్ఫేర్ సొసైటీ, ఆల్ ఫాయిజన్ సొసైటీల సంయుక్త ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ అమీర్ అలీఖాన్ అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో దళితుల కంటే ముస్లింలు సామాజికంగా, విద్యా రంగంలో వెనుకబడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ముస్లిం సంక్షేమం కోసం కేవలం రూ.2వేల కోట్లు కేటాయిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం తన మేనిఫెస్టోలో రూ.5వేల కోట్లు చేర్చిందని, త్వరలోనే ఆ నిధులు మంజూరయ్యేలా సీఎం రేవంత్‌రెడ్డితో చర్చిస్తానన్నారు. ప్రతీ పేద ముస్లింకు ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తానన్నారు. కేంద్రంలో కుర్చీ కోసం బీజేపీ సర్కార్ మత విద్వేషాలను రెచ్చగొడుతోందని విమర్శించారు. డాక్టర్ అనీసిద్దిఖీ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ ఖుస్రూపాషా, డాక్టర్ జమాలషరీఫ్, డాక్టర్ రజామాలిక్, ప్రొఫెసర్ ముస్తఫా, డాక్టర్ రాజ్‌మహ్మద్, సిరాజ్ అహ్మద్, నయామొద్దీన్, నస్రీన్ వాహిది, ఇస్మాయిల్ షంషీ, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అమీర్ అలీఖాన్

రేపు ఉమ్మడి వరంగల్ జిల్లా గాయకుల ఎంపిక

నయీంనగర్: 'నూరేండ్ల నా ఊరు' గేయం కోసం ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి గాయకులను ఎంపిక చేసి చారిత్రక పాటలో అవకాశం కల్పించనున్నట్లు కవి, గాయకుడు వరంగల్ శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం హనుమకొండలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వంద సంవత్సరాల పల్లె చరిత్ర, మానవ జీవన విధానం, సంస్కృతి, సంప్రదాయాలు, మానవీయ విలువలు చాటి చెప్పేలా అప్పటి యాస, భాషతో కూడిన సాహిత్యాన్ని భావితరాలకు అందించాలనే ఉద్దేశంతో 243 చరణాలు కలిగిన గేయం రచించి దానిని 243 మంది గాయకులతో పాడిస్తామన్నారు. ఇందుకోసం రెండు తెలుగు రాష్ట్రాల ఉంచి గాయకులను ఎంపికచేస్తామన్నారు. మొదట ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి ప్రారంభిస్తామన్నారు. రేపు (బుధవారం) కేయూ బైపాస్‌లోని శారదా ఫంక్షన్ హాల్‌లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు గాయకుల ఎంపిక జరుగుతుందని తెలిపారు. సమావేశంలో కళాకారులు గిద్దె రాంనర్సయ్య, జూపాక శివ, వెంకన్న, సునీల్, సంజీవ, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వరంగల్ శ్రీనివాస్

దూరవిద్య ప్రవేశాల గడువు పొడిగింపు

కేయూ క్యాంపస్ : కాకతీయ విశ్వవిద్యాలయం దూర విద్య కేంద్రం అందిస్తున్న డిగ్రీ, పీజీ, డిప్లొమా, సర్టిఫికెట్, ఓరియంటేషన్ కోర్సుల్లో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాలకు గడువు పొడిగించినట్లు దూరవిద్య కేంద్రం (ఎస్‌డీఎల్‌సీఈ) డైరెక్టర్ వల్లూరి రామచంద్రం మంగళవారం తెలిపారు. ఈనెల 15వతేదీతో గడువు ముగియడంతో పెంపుదల చేసినట్లు వెల్లడించారు. అభ్యర్థులు ఈనెల 30 వరకు దరఖాస్తు చేసుకోవచ్చుని వివరించారు. మొత్తం 33 కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు ఆహ్వానిస్తున్నామన్నారు. డిగ్రీలో బీఏ, బీకాం, జనరల్ కంప్యూటర్స్, బీబీఏ, బీఎస్సీ, బీఎల్, బీఎస్సీ, ఎం.ఏ తెలుగు, ఇంగ్లిష్, హిందీ, సంస్కృతం, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, పొలిటికల్ సైన్స్, ఎకనామిక్స్, హిస్టరీ, రూరల్ డెవలప్‌మెంట్, సోషియాలజీ, హెచ్ఆర్ఎం, ఎం.కామ్, సోషల్ వర్క్, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, ఎమ్మెస్సీ సైకాలజీ, గణితశాస్త్రం, ఎన్విరాన్మెంటల్ సైన్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, వృక్ష, జంతు శాస్త్రాలు, ఎంఎల్ఐఎస్సీ ఉన్నాయని తెలిపారు. అలాగే, డిప్లొమా కోర్సుల్లో కంప్యూటర్ అప్లికేషన్స్, గైడ్స్ అండ్ కౌన్సెలింగ్, యోగా, సర్టిఫికెట్ కోర్సుల్లో సీఎల్ఐఎస్సీ, మిమిక్రీలో ఓరియంటేషన్ కోర్సుల్లోనూ ప్రవేశాలు పొందొచ్చన్నారు. అభ్యర్థులు తమ సర్టిఫికెట్లు, ఫొటో జత చేసి కోర్సు రుసుం ఆన్‌లైన్‌లో కాని దూర విద్య కేంద్రం ఎస్‌బీఐ ఎక్స్‌టెన్షన్ కౌంటర్ నుంచి చలాన్ ద్వారా కాని చెల్లించొచ్చన్నారు. కోర్సులు, ఫీజులు వివరాలకు 0870–24611480,2461490 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

కాల్వలో పడి వ్యక్తి మృతి

- మృతదేహాన్ని వెలికి తీసి కుటుంబీకులకు అప్పగించిన పోలీసులు



చిరంజీవి (ఫైల్)

రామన్నపేట : ఓ వ్యక్తి కాల్వలో పడి మృతి చెందాడు. ఈ ఘటన వరంగల్ డాక్టర్స్ కాలనీలో చోటు చేసుకుంది. మట్టెవాడ పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్ డాక్టర్స్ కాలనీలో నివాసముంటూ ప్రైవేట్ డ్రైవర్‌గా జీవనం కొనసాగిస్తున్న గజ చిరంజీవి(39) సోమవారం రాత్రి 9 గంటల సమయంలో తన బైక్‌పై ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో తన ఇంటికి సమీపంలోని క్వాలలో కాలుకు అంటుకున్న బురద కడుక్కునేందుకు అందులోకి దిగాడు. ఈ సమయంలో కాలు జారడంతో కొట్టుకుపోయాడు. సురేశ్ అనే వ్యక్తి దీనిని గమనించి చిరంజీవి కుటుంబ సభ్యులకు తెలిపాడు. కాగా, చిరంజీవి మృతదేహం గీసుగొండ మండలం బాలయ్యపల్లి బ్రిడ్జి వద్ద చిక్కుకోగా పోలీసులు మృతదేహాన్ని వెలికితీసి మంగళవారం కుటుంబీకులకు అప్పగించారు. ఈ ఘటనపై మృతుడి భార్య వనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తుమ్మ గోపి తెలిపారు.

ఆప్త మిత్రుడిని కోల్పోయాం..

- నరేశ్‌రెడ్డి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుంది
- మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు
- మాజీ మంత్రి హరీశ్‌తోపాటు పలువురు బీఆర్ఎస్ నేతల నివాళి





నరేశ్‌రెడ్డి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రులు హరీశ్‌రావు, సత్యవతి రాథోడ్, రాజ్యసభ సభ్యుడు వద్ది రాజు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, తదితరులు

మరిపెడ రూరల్: ఆప్త మిత్రుడు నూకల నరేశ్ రెడ్డిని కోల్పోయామని రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నూకల నరేశ్‌రెడ్డి ఇటీవల మృతి చెందిన విషయం విధితమే. కాగా, ఆయన వ్యవసాయ క్షేత్రంలో మంగళవారం నిర్వహించిన దశ దిన కర్మలకు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరై నరేశ్‌రెడ్డి చిత్ర పటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నరేశ్ రెడ్డి కుమారులు అనిరుధ్‌రెడ్డి, అభినవ్‌రెడ్డిని మంత్రులు పరామర్శించారు. అనంతరం మంత్రులు పొంగులేటి, తుమ్మల మాట్లాడుతూ ఫ్యామిలీ రిలేషన్ కంటే కూడా వ్యక్తిగతంగా నరేశ్‌రెడ్డి తమకు ఆప్త మిత్రుడన్నారు. నరేశ్‌రెడ్డి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోతు రాంచంద్రునాయక్, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, భూక్య మురళీనాయక్, తెల్లం వెంకట్రావు, జారే ఆదినారాయణ, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు భరత్‌చంద్రారెడ్డి, జిల్లా నాయకులు వంటికొమ్ము యుగేందర్‌రెడ్డి, పెండ్లి రఘువీర్‌రెడ్డి, ఘనపురపు అంజయ్య, వేణుగోపాల్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు తాజుద్దీన్, గొడుగు శ్రీనివాస్, కాలం శ్రీనివాస్‌రెడ్డి, పానుగోతు రాంలాల్, గంధసిరి అంబరీష, మెంచ్ అశోక్, పటేల్ దుర్గయ్య, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నేతల ఘననివాళి..

నరేశ్‌రెడ్డి దశ దిన కర్మలకు బీఆర్ఎస్ పార్టీ మాజీ మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు నరేశ్‌రెడ్డి చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. వారి వెంట రాజ్య సభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, డిప్యూటీ స్పీకర్ బండ ప్రకాశ్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ బిందు, మాజీ ఎమ్మెల్యేలు డీఎస్ రెడ్యానాయక్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, బానోత్ శంకర్‌నాయక్, మాజీ ఎంపీలు నామా నాగేశ్వరరావు, మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, మాజీ ఓడీ ఎస్ఎంఎస్ చైర్మన్ కుడితి మహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో..

సీపీఎం ఆధ్వర్యంలో నూకల నరేశ్‌రెడ్డి చిత్ర పటానికి నాయకులు మంగళవారం ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సాధుల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సోమయ్య, గునిగంటి రాజన్న, అల్వాల వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ ధరణి కన్నుమూత

- చికిత్స పొందుతూ మృతి



ధరణి(ఫైల్)

నల్లబెల్లి/హసన్‌పర్తి: నల్లబెల్లి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న మహిళా కానిస్టేబుల్ జోరుక ధరణి(24) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఎస్సై ప్రశాంత్ బాబు కథనం ప్రకారం.. హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం పెంబర్తికి చెందిన జోరుక రాజేశ్వరి, కుమారస్వామి దంపతుల కూతురు ధరణి నల్లబెల్లి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ పోలీస్ క్వార్టర్స్‌లో ఉంటోంది. తన ద్విచక్ర వాహనం కోసం తీసుకొచ్చిన పెట్రోల్‌ను గదిలో ఉంచింది. ఈ నెల 13న పెట్రోల్ బాటిల్ లీకేజీ కావడంతో గదిలో మంటలు వ్యాపించి ధరణికి అంటుకోగా బయటకు వచ్చింది. ఈ విషయం సహ మహిళా కానిస్టేబుల్ స్వర్ణకు చెప్పింది. అప్రమత్తమైన స్వర్ణ పోలీస్ ఉన్నతాధికారులకు సమాచారం అందిస్తూ కాలిన గాయాలతో ఉన్న ధరణిని పెట్రోకార్‌లో ఎంజీఎంకు తరలించింది. వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. ధరణి మృతితో స్వగ్రామం పెంబర్తిలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతురాలి సోదరుడు వంశీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా, 2020 బ్యాచ్‌కు చెందిన ధరణి.. పరకాల పోలీస్ స్టేషన్‌లో మొదటి పోస్టింగ్ పొందారు. అనంతరం 2022 సెప్టెంబర్‌లో బదిలీపై నల్లబెల్లి పోలీస్ స్టేషన్‌కు వచ్చారు.

కళాక్షేత్రానికి ఉర్దూభాష నేమ్‌ప్లేట్ బిగింపు



సాక్షి స్పందన

న్యూశాయంపేట : హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రానికి రాష్ట్ర రెండో అధికార భాష ఉర్దూ నేమ్‌ప్లేట్‌ను బిగించారు. కాగా, కాళోజీ కళాక్షేత్రం పేరు ఉర్దూలో కూడా లిఖించాలని ఆ భాషాభిమానులు, కళాకారులు, కవులు డిమాండ్ చేస్తున్నారు. ఈ అంశంపై 'సాక్షి'లో ప్రచురితమైన వరుస కథనాలకు కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) అధికారులు స్పందించారు. మంగళవారం కళాక్షేత్రం ఎదుట ఉన్న గ్రిల్స్‌కు తాత్కాలికంగా ఉర్దూ భాషలో లిఖించిన నేమ్‌ప్లేట్ బిగించారు. కాగా, పర్మనెంట్‌గా బిల్డింగ్ పై భాగంలో రేడియం అక్షరాలతో ఉర్దూ నేమ్‌ప్లేట్ ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ మైనారిటీ విభాగం అధ్యక్షుడు మహ్మద్ నయీం డిమాండ్ చేశారు.

వరంగల్ మార్కెట్‌లో అంతర్గత బదిలీలు

- ఖరీఫ్‌లో విధుల నిర్వహణ కోసమే మార్పులు
- ఖాళీ పోస్టులతో ఉన్న వారిపై అదనపు భారం



వరంగల్ వ్యవసాయ మార్కెట్ ప్రధాన కార్యాలయం

వరంగల్: ఏనుమాములలోని వరంగల్ వ్యవసాయ మార్కెట్ పరిధిలోని ప్రధాన కార్యాలయం, లక్ష్మీపురంలోని మోడల్ కూరగాయల మార్కెట్, పండ్ల మార్కెట్‌లో విధులు నిర్వర్తించే సూపర్‌వైజర్లు, ఏఎంఎస్, జేఎంఎస్‌లను పెద్ద ఎత్తున అంతర్గత బదిలీలు చేస్తూ మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.నిర్మల మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. జి.శ్రీకాంత్(సూపర్‌వైజర్)కు అసెస్‌మెంట్ సెక్షన్ (ఎ టు ఎం), పర్చేజ్ రిటర్న్, మార్కెట్ ఫీజుల వసూళ్లు, జేడీఎం, డీడీఎం, డీఎంఓలకు నివేదికలు పంపించే బాధ్యతలు అప్పగించారు. వినయ్‌కాంత్ యూడీసీకి అసెస్‌మెంట్ సెక్షన్(ఎన్ టు జెడ్), పర్చేజ్ రిటర్న్, మార్కెట్ ఫీజుల వసూళ్లు, జేడీఎం, డీడీఎం, డీఎంఓలకు నివేదికలు పంపించే బాధ్యతలు అప్పగించారు. గంగాధర్(సూపర్‌వైజర్)కు కోల్డ్ స్టోరేజీలు, గోదాంల నిర్వహణ, వాచ్ అండ్ వార్డు ఇన్‌చార్జ్ విధులు అప్పగించారు. వి.స్వప్న (సూపర్‌వైజర్)కు కార్యాలయంలోని ఎస్టాబ్లిష్‌మెంట్–1 సెక్షన్‌తో పాటు ధాన్యం, అపరాల యార్డు పూర్తి ఇన్‌చార్జ్ బాధ్యతలతో పాటు ఈ–నామ్ నిర్వహణ, రైతులకు లాట్ ఐడీల జారీ తదితర బాధ్యతలు అప్పగించారు. డి.లక్ష్మీనారాయణ(యూడీసీ)కు ధాన్యం, అపరాల యార్డు నిర్వహణ అప్పగించారు. మురళీయాదవ్(సూపర్‌వైజర్)ను లక్ష్మీపురం మోడల్ వెజ్ మార్కెట్ పూర్తి ఇన్‌చార్జ్‌గా నియమించారు. సలీం(సూపర్‌వైజర్)ను పత్తి యార్డులో పూర్తి ఇన్‌చార్జ్‌గా నియమించారు. చక్రబహదూర్ (సూపర్‌వైజర్)కు గ్రేయిన్ మార్కెట్‌లోని యార్డుల్లో దడవాయిలకు విధుల కేటాయింపు, మౌలిక వసతులు, పారిశుద్ధ్యం, లైటింగ్ పర్యవేక్షణ అప్పగించారు. సాగర్(సూపర్‌వైజర్)కు అదనంగా మిర్చి యార్డు విధులు కేటాయించారు. డి.నర్సింహ(సూపర్‌వైజర్)కు పత్తి యార్డులో పూర్తి విధులు అప్పగించారు. జ్యోతి ప్రకాశ్ (సూపర్‌వైజర్)మార్కెట్ ప్రధాన కార్యాలయానికి వచ్చే లెటర్లు, దరఖాస్తులు ఇన్‌వార్డులో నమోదు చేసి కార్యదర్శికి, కార్యాలయం నుంచి ప్రభుత్వ కార్యాలయాలకు పంపే లెటర్లు ఔట్ వార్డ్ నిర్వహిస్తారు. నర్సింగరావు(సూపర్‌వైజర్)కు ప్రధాన కార్యాలయంలో డిమాండ్ సెక్షన్, తక్‌పట్టీ సెక్షన్, బజారు సెక్షన్ల పూర్తి బాధ్యతలు అప్పగించారు. శ్రీనునాయక్(సూపర్‌వైజర్)కు లక్ష్మీపురం పండ్ల మార్కెట్‌లో పూర్తి ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు అప్పగించారు. జి.వివేక్(జేఎంఎస్) పత్తి యార్డు విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. ఎం.రజిత(జేఎంఎస్) ప్రధాన కార్యాలయంలోని డిమాండ్, తక్‌పట్టీ సెక్షన్‌తో పాటు మిర్చి యార్డులో సహాయకులిగా అదనపు విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది.

సీజన్‌లో ఇబ్బందులు లేకుండా..



రానున్న ఖరీఫ్ సీజన్‌లో వరంగల్ వ్యవసాయ మార్కెట్‌కు వచ్చే రైతులకు సరుకుల కొనుగోళ్లలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా యార్డుల్లో విధులు నిర్వర్తించేందుకు ఉద్యోగులకు అంతర్గత బదిలీలు నిర్వహించాం. సీసీఐ కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాగానే అక్కడ విధులు నిర్వర్తించేందుకు అదనపు బాధ్యతలు అప్పగిస్తాం.

–పి.నిర్మల, మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి

ఉద్యోగులపై అదనపు భారం...

వరంగల్ వ్యవసాయ మార్కెట్ పరిధిలో అన్ని క్యాడర్లు గ్రేడ్–1, గ్రేడ్–2, యూడీసీ, అకౌంటెంట్, ఎల్‌డీసీ, గ్రేడర్, ఏఎస్‌లు, సూపర్‌వైజర్లు, ఏఎంఎస్, జేఎంఎస్‌లతో కలిపి 109 మంజూరు పోస్టులు ఉన్నాయి. ఇందులో 83 పోస్టులు ఖాళీ ఉండగా కేవలం 26 పోస్టుల్లో మాత్రమే ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ ఖాళీలతో ప్రస్తుతం ఉన్న వారికి అదనపు బాధ్యతలు అప్పగించడం వల్ల యార్డుల్లో పర్యవేక్షణ కొరవడే అవకాశాలు ఉంటాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం ఖాళీ పోస్టులను భర్తీ చేస్తే మార్కెట్‌లో పర్యవేక్షణ పెరిగి రైతుల సరుకులకు గిట్టుబాటు ధర లభించే అవకాశం ఉంటుందని రైతు సంఘాల నాయకులు పేర్కొంటున్నారు.

వ్యక్తి పై కేసు నమోదు

ఖిలా వరంగల్ : చెల్లెపై దాడికి పాల్పడిన అన్నపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సురేశ్ తెలిపారు. శంభునిపేట విశ్వనాథ కాలనీలో పాలేపాక అరుణ నివాసం ఉండగా.. ఆమె అన్న మస్తాన్ వరంగల్ లక్ష్మీపురంలో నివాసం ఉంటున్నాడు. తన భార్యను తీసుకురావాలని మస్తాన్ తన చెల్లి అరుణ కోరాడు. దీనికి ఆమె నిరాకరించడంతో ఈనెల 12న దాడికి పాల్పడ్డాడు. అరుణ ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై సురేశ్ తెలిపారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 16న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. న్యూశాయంపేట ఫీడర్లోని లోటస్ కాలనీ, మైత్రివనం కాలనీ, విల్లా ప్రాంతాల్లో ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు ప్రైవేట్ కళాశాలల యజమాన్యాల నిరసన దీక్ష

హన్మకొండ: ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయాలని రెండు రోజులుగా ప్రైవేట్ కళాశాలల బంద్ చేపట్టినా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో ఈనెల 16న నిరసన దీక్ష చేపట్టనున్నట్లు కాకతీయ డిగ్రీ, పీజీ కళాశాలల మేనేజింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.ఉపేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం.ప్రభాకర్ రెడ్డి తెలిపారు. మూడేళ్లుగా రీయింబర్స్మెంట్ నిధులు విడుదల చేయకపోవడంతో ప్రైవేట్ కళాశాలల యజమాన్యాలు ఇబ్బందులు పడుతున్నాయని ఒక ప్రకటనలో తెలిపారు. ఈక్రమంలో హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కు వద్ద యజమానులు, అధ్యాపకులు బుధవారం నిరసన దీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు. దీక్ష అనంతరం కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లి కలెక్టర్కు వినతి పత్రం అందజేయనున్నట్లు వారు పేర్కొన్నారు.

నేటి నుంచి కళా ఉత్సవ్ పోటీలు

కాళోజీ సెంటర్: మండలస్థాయిలో ఈనెల 16, 17 తేదీల్లో కళా ఉత్సవ్ పోటీలు నిర్వహించి, ఎంపికైన వారిని జిల్లాస్థాయికి పంపించాలని వరంగల్ డీఈఓ ఎం.జ్ఞానేశ్వర్ సూచించారు. ఈనెల 18న జిల్లాస్థాయి పోటీలు వరంగల్లోని బిర్లా ఓపెన్ మైండ్ స్కూల్లో నిర్వహించి రాష్ట్రస్థాయికి ఎంపిక చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



నయీంనగర్: మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఎమ్మెల్సీ అమీర్ అలీఖాన్ తెలిపారు. 6వ డివిజన్ బొక్కలగడ్డలో ముస్లిం వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న కుట్టుశిక్షణ కేంద్రాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా అలీఖాన్ మాట్లాడుతూ శిక్షణతో మహిళలు ఆర్థికంగా ఎదుగుతారని చెప్పారు. ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి సిరాజ్ అహ్మద్, నస్రీన్ వహీద్, రాజమొహమ్మద్, సలీం తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ఇన్స్టిట్యూట్లో పెయింటింగ్ పోటీలు



కాజీపేట రూరల్: భారతీయ రైల్వే నిర్వహిస్తున్న స్వచ్ఛ పక్వాడ్, స్వచ్ఛ భారత్లో భాగంగా కాజీపేట రైల్వే జనరల్ ఇన్స్టిట్యూట్లో స్వచ్ఛభారత్ అనే అంశంపై మంగళవారం పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలకు రైల్వే ఎలక్ట్రిక్ లోకోషెడ్ సీనియర్ డీఈఈ, రైల్వే ఇన్స్టిట్యూట్ చైర్మన్ ఆర్.ప్రశాంత్ కృష్ణసాయి చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో రైల్వే ఇన్స్టిట్యూట్ సెక్రటరీ దేవులపల్లి రాఘవేందర్, ట్రెజరర్ గిరిమిట్ల రాజేశ్వర్ రావు, కార్యవర్గ సభ్యులు సందె ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

ఎంజీఎంలో రక్తదాన శిబిరం

ఎంజీఎం: సేవా వెల్ఫేర్ సొసైటీ 6వ వార్షికోత్సవం, భారత మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ఎంజీఎం రక్తనిధి కేంద్రంలో మంగళవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించినట్లు సొసైటీ ప్రధాన కార్యదర్శి అయిత ఉషాభాస్కర్ తెలిపారు. 20మంది దాతలు రక్తదానం చేసినట్లు వివరించారు. రక్తదాతలకు ఎంజీఎం బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఆశాదేవి, డాక్టర్ అభిలాష్ ప్రశంస పత్రాలు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ వ్యవస్థాపకుడు జూపాక రత్న ప్రణయ్, కోశాధికారి దూలం సందీప్, కమిటీ సభ్యులు కుమ్మరి నిఖిల్, ప్రదీప్, సుకుమార్, సీడబ్ల్యూసీ సభ్యులు పరికి సుధాకర్, తోట రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లాపురంలో వైద్య శిబిరం

హసన్పర్తి: 65వ డివిజన్ ఎల్లాపురంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురిని వైద్యులు పరీక్షించి మందులు అందించారు. తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ మహేందర్, డాక్టర్ విజయగిరి, డాక్టర్ సురేష్, సిబ్బంది మేరీ, రుతమ్మ, కందుకూరి సంతోష్, నాగయ్య, శాంత, సుమలత, ఆశవర్కర్లు, శోభారాణి, శోభ తదితరులు పాల్గొన్నారు.

పదేళ్లుగా ఎదురుచూపులు



బురదమయంగా రోడ్డు



దారిలో ఉన్న బండరాళ్లు

- రూ.కోటితో వందఫీట్ల రోడ్డుకు ప్రతిపాదనలు
- అధ్వానంగా న్యూశాయంపేట - దర్గా కాజీపేట రోడ్డు

కాజీపేట అర్బన్: కాజీపేట మండలం న్యూశాయంపేట నుంచి దర్గా కాజీపేటకు వెళ్లే మార్గం అధ్వానంగా తయారైంది. పదేళ్ల క్రితం వంద ఫీట్ల రోడ్డు నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశారు. కొన్ని అనివార్య కారణాల వల్ల రోడ్డు నిర్మాణ పనులు ఆగిపోయాయి. దాంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

దశాబ్ద కాలంగా..

వంద ఫీట్ల రోడ్డు కోసం ప్రజలు పదేళ్లుగా ఎదురుచూస్తున్నారు. సుమారు రూ.కోటి అంచనా వ్యయంతో వంద ఫీట్ల రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కొన్ని కారణాల వల్ల పనులు ముందుకు సాగలేదు. న్యూశాయంపేట నుంచి దర్గా కాజీపేట మీదుగా వెళ్లే దారి గుంతలమయంగా మారింది. రోడ్డు మధ్యలో బండరాళ్లు ఉన్నాయి. దారి పక్కన మురుగునీటితో దుర్వాసన వస్తోంది. దాంతో భట్టుపల్లిలోని ఇందిరమ్మ కాలనీవాసులు అటుగా వెళ్లడం లేదు.

సఖి కేంద్రం సేవల్ని వినియోగించుకోవాలి



హన్మకొండ అర్బన్: వాల్పోస్టర్ల ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య, తదితరులు



మడికొండ: సదస్సులో మాట్లాడుతున్న వినీల

హన్మకొండ అర్బన్: సఖి కేంద్రంలో అందిస్తున్న సేవలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. మంగళవారం కలెక్టరేట్లో సఖి కేంద్రం ద్వారా మహిళలకు అందిస్తున్న సేవలకు సంబంధించి పోస్టర్, వీడియోను కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి రాజమణి, ఇతర అధికారులు, సఖి ప్రతినిధులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

మడికొండ: మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సఖి సెంటర్ కేస్ వర్కర్ వినీల అన్నారు. కాజీపేట మండలం రాంపూర్లోని గ్రామ పంచాయితీ భవనంలో ఆర్పీ నిర్మల ఆధ్వర్యంలో సఖి సెంటర్ సేవలపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వినీల మాట్లాడుతూ గృహ హింస, లైంగిక వేధింపులు, పనిచేసే చోట వేధింపులు, అత్యాచారాలు, తదితర వేధింపుల నుంచి రక్షణ పొందడానికి సఖి కేంద్రం బాధిత మహిళలు, బాలికలకు అండగా ఉంటుందని వివరించారు. సమస్య ఎదురైనప్పుడు 181, 0870 - 2452112, 73829 83088 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. బాధితులకు న్యాయ, పోలీస్, కౌన్సెలింగ్, వసతి కల్పించనున్నట్లు తెలిపారు. కేస్ వర్కర్ హరిత పాల్గొన్నారు.

కార్మికులకు కనీస వేతనం చెల్లించాలి



నినాదాలు చేస్తున్న నాయకులు, కార్మికులు

న్యూశాయంపేట: మున్సిపల్ కార్మికులను క్రమబద్ధీకరించే వరకు కనీస వేతనాన్ని అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ డిమాండ్ చేశారు. తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ హనుమకొండ ప్రథమ మహాసభను రాంనగర్లోని సీఐటీయూ భవన్లో మంగళవారం నిర్వహించారు. ఇమ్మడి సాగర్, సువర్ణ అధ్యక్షతన జరిగిన సభలో మండలంలోని అన్ని డివిజన్ల ప్రతినిధులు, నాయకులు అశోక్, సువర్ణ, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మండల కమిటీని ఎన్నుకున్నారు.

క్రమబద్ధీకరణకు ఐక్య ఉద్యమాలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ కోసం ఐక్య ఉద్యమాలు చేపట్టనున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ అన్నారు. ఆల్ యూనివర్సిటీస్ రాష్ట్ర అధ్యక్షుడు మెట్టు రవి ఆధ్వర్యంలో 40మంది ఔట్సోర్సింగ్ ఉద్యోగులు మంగళవారం సీఐటీయూలో చేరారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యూనివర్సిటీలకు ప్రభుత్వాలు గ్రాంట్లు ఇవ్వడం లేదని, వర్సిటీలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని గుర్తుచేశారు. ఎర్రెల్లి శోభన్కుమార్, మామిండ్ల పున్నంచందర్, ఇంద విజయరావు, ఆలువాల రంజిత్, దామెర రణధీర్, సత్యం, నాగరాజుతోపాటు పలువురు సీఐటీయూలో చేరారు. కార్యక్రమంలో సీఐటీయూ యూనివర్సిటీ నాయకులు కచ్చకాయల చిరంజీవి, రాంచందర్, మధు, దేశిని రవికుమార్, పల్లంరాజు, సందీప్, శోభ, రజిత, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఓంకార్ వర్ధంతిని జయప్రదం చేయాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

వరంగల్ చౌరస్తా: ఎంసీపీఐ (యూ) వ్యవస్థాపకుడు, మాజీ ఎమ్మెల్యే మద్దికాయల ఓంకార్ 16వ వర్ధంతిని జయప్రదం చేయాలని ఆ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. వరంగల్ అండర్ బ్రిడ్జికి సమీపంలోని ఓంకార్ భవన్లో ఓంకార్ వర్ధంతి కరపత్రాలను పార్టీ వరంగల్ జిల్లా సహాయ కార్యదర్శి నర్ర ప్రతాప్, నగర కార్యదర్శి సుంచు జగదీశ్వర్ ఆధ్వర్యంలో మంగళవారం వాల్పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 14వ ఏళ్ల వయస్సులోనే భూస్వాములు, నైజాంలకు వ్యతిరేకంగా, దోపిడీ, వెట్టిచాకిరీ, బానిసత్వంపై ఓంకార్ పోరాటాలు చేశారని గుర్తుచేశారు. అటవీ భూములు, భూస్వాముల భూములు పేదలకు పంచి దున్నేవాడికే భూమి కావాలని పోరాడిన మహా నాయకుడని కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఐతం నాగేష్, మాలి ప్రభాకర్, అప్పనపురి నర్సయ్య, నలివెల రవి, రాయినేని ఐలయ్య, జటబోయిన నరసయ్య పాల్గొన్నారు.

మహిళలు సాధికారత సాధించాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న రమాదేవి, ఉపాధ్యాయులు

ఖిలా వరంగల్: మహిళలు, బాలికలు అన్నిరంగాల్లో రాణిస్తూ, ఆర్థికంగా ఎదిగి సాధికారత సాధించాలని జిల్లా మహిళా అభివృద్ధి జెండర్ స్పెషలిస్ట్ రమాదేవి సూచించారు. అంతర్జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా ఖిలా వరంగల్ ఆరెల్లి బుచ్చయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలిక సాధికారతపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ చట్టాలపై బాలికలు అవగాహన పెంచుకోవాలని అన్నారు. ఆపద, సమస్య ఎదురైనప్పుడు 181, 1098, 100, 14567, 1930 టోల్ఫ్రీ నంబర్లకు కాల్ చేయాలని తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి పరిష్కార మార్గం చూపుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం బి.ప్రసాద్, ఉపాధ్యాయులు శైలేంద్ర కుమార్, శోభారాణి, వెంకటరమణ, భాస్కర్ పాల్గొన్నారు.

నేడు సీఎం కప్ టార్చ్ ర్యాలీ

వరంగల్ స్పోర్ట్స్ / కాశిబుగ్గ: గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ గల క్రీడాకారులను వెలికి తీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న, ఈనెల 3న హైదరాబాద్లో బయలుదేరిన సీఎం కప్ టార్చ్ ర్యాలీ నగరానికి బుధవారం చేరుకుంటుందని హనుమకొండ డీవైఎస్ఓ గుగులోత్ అశోక్కుమార్, వరంగల్ జిల్లా యువజన క్రీడల అధికారి సత్యవాణి మంగళవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. నగరంలోని పోచమ్మమైదాన్ జంక్షన్, ఎంజీఎం, కేఎంసీ, హనుమకొండ చౌరస్తా, పోలీస్ కమిషనరేట్, వరంగల్ కలెక్టరేట్, హనుమకొండ కలెక్టరేట్ మీదుగా ర్యాలీ కొనసాగుతుందని వారు తెలిపారు. క్రీడా ర్యాలీలో యువత, క్రీడాకారులు, క్రీడాభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

అభ్యంతరాలు తెలియజేయాలి

గీసుకొండ: స్టాఫ్నర్సుల నియామకానికి సంబంధించి అభ్యర్థుల ప్రొవిజనల్ మెరిట్ జాబితాను డీఎంహెచ్ఓ కార్యాలయ నోటీస్బోర్డు, కలెక్టర్ వెబ్సైట్లో పొందుపరిచినట్లు వరంగల్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబితాలో ఏమైనా అభ్యంతరాలుంటే ఈనెల 16, 17 తేదీల్లో సాయంత్రం 5గంటల వరకు అందజేయాలన్నారు. అభ్యంతరాలు తెలియజేయకుంటే ప్రొవిజనల్ మెరిట్ జాబితాను ఫైనల్ మెరిట్ జాబితాగా భావించి నియామకాలు చేపడుతామని పేర్కొన్నారు.

పూర్వ విద్యార్థుల సమావేశం



కాజీపేట: కాజీపేట 62వ డివిజన్ రహమత్నగర్ కాలనీ సెయింట్ జాన్స్ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం పూర్వ విద్యార్థుల సమావేశం జరిగింది. 2005 -06లో పదవ తరగతి చదివిన విద్యార్థులు మంగళవారం ఒక చోట కలుసుకుని నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విద్య, బుద్ధులు నేర్పిన గురువులను శాలువలు కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంతోష్, సతీమ, అన్వర్, గిరిజా, పద్మావతి, రవిప్రసాద్ పాల్గొన్నారు.

ఉరేసుకుని కిరోసిన్ మాజీ డీలర్ ఆత్మహత్య

ఖిలా వరంగల్: ప్రభుత్వం కిరోసిన్ వ్యవస్థను రద్దు చేయడం, రావాల్సిన కమీషన్ డబ్బులు రాక ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం చెంది కిరోసిన్ మాజీ డీలర్ ఫ్యాన్కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మామునూరులో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం మామునూరుకు చెందిన సింగారపు కుమారస్వామి (67) కిరోసిన్ డీలర్గా గతంలో పనిచేసేవాడు. కిరోసిన్ వ్యవస్థను ప్రభుత్వం రద్దు చేయడంతో ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్యంతో మనస్తాపం చెంది బలవన్మరణానికి పాల్పడ్డాడు. సింగారపు మధు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

మత్స్య భవన నిర్మాణానికి సహకరించాలి



మాట్లాడుతున్న మల్లేశం

హన్మకొండ చౌరస్తా: హనుమకొండలోని పెద్దమ్మగడ్డ శివారు ఎస్ఆర్ఎస్పీ కెనాల్ పక్కన ఉన్న మత్స్య సహకార సంఘం స్థలంలో మత్స్య భవన నిర్మాణానికి ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు సహకరించాలని మత్స్య సహకార సంఘం హనుమకొండ జిల్లా చీఫ్ ప్రమోటర్ బుస్సా మల్లేశం కోరారు. హనుమకొండ ములుగురోడ్డు సమీపంలోని జిల్లా మత్స్య సహకార సంఘం కార్యాలయంలో సంఘం సభ్యుల సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యసభ సభ్యుడి నిధుల నుంచి రూ.50 లక్షల నిధులు కేటాయించినా రాజకీయ కారణాలతో భవన నిర్మాణానికి నోచుకోలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వంలోనైనా ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని మత్స్యకారుల కోసం ప్రత్యేక భవనం నిర్మించాలని కోరారు. మత్స్య సహకార సంఘం, ప్రాథమిక సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించాలని సూచించారు. పూర్తిస్థాయిలో ఉచిత చేప పిల్లల పంపిణీ చేయాలన్నారు. సమావేశంలో సహకార సంఘం వరంగల్ అధ్యక్షుడు చొప్పరి సోమయ్య, డైరెక్టర్లు పిట్టల సత్యనారాయణ, పిట్టల సుధాకర్, గండి రాజమౌళి, బయ్య తిరుపతి, పెండ్యాల జగదీశ్వర్, బోనగిరి రాంబాబు, కొండా మొగిలి, శీలం పృథ్వీరాజ్, నీరటి సదానందం పాల్గొన్నారు.

బెదిరించే వ్యక్తిపై చర్య తీసుకోవాలని నిరసన



నిరసన తెలుపుతున్న సంధ్యారాణి, బంధువులు

ఖిలా వరంగల్: తమను బెదిరిస్తున్న వ్యక్తిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని బాధితులు డిమాండ్ చేశారు. ఖిలా వరంగల్ పడమరకోటలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట బంధువులతో కలిసి పడమరకోట ఎస్సీ వాడకు చెందిన ఎండీ.సంధ్యారాణి మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శివనగర్ భూపేష్నగర్కు చెందిన హుస్సేన్తో తనకు ప్రేమవివాహం అయిందని తెలిపారు. హుస్సేన్ భవన కార్మికుడిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడని పేర్కొన్నారు. మేస్త్రి గూడూరు శివ దగ్గరకు హుస్సేన్ వెళ్లి మృతి చెందాడని సంధ్యారాణి ఆందోళన వ్యక్తం చేశారు. ఈక్రమంలో శివపై మిల్స్కాలనీ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా, తనతో పాటు తన అక్క కొడుకును అతడు భయాందోళనకు గురి చేస్తున్నాడని వాపోయారు.

రైస్ మిల్లులపై సమగ్ర విచారణ చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న సుదర్శన్

ఖిలా వరంగల్: రాష్ట్ర పరిశ్రమల శాఖ ద్వారా ఎస్సీ, ఎస్టీ పేర్ల మీద కొంతమంది ధనికులు రైస్ మిల్లులు స్థాపించి కోట్లాది రూపాయల రాయితీలు పొంది, అనంతరం మూసివేసిన మిల్లులపై సమగ్ర విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని వినియోగదారుల సమాఖ్య (సీసీఐ) రాష్ట్ర అధ్యక్షుడు మొగిలిచెర్ల సుదర్శన్ కోరారు. హైకోర్టు న్యాయవాది, సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మురారిశెట్టి యశ్వంత్ కుమార్ అధ్యక్షతన వరంగల్ శివనగర్లోని వినియోగదారుల జిల్లా సమాఖ్య కార్యాలయంలో జిల్లా ప్రతినిధుల సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా సుదర్శన్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల పేర్ల మీద రాయితీలపై రైస్ మిల్లులు నిర్మించి మూడేళ్లు కూడా గడవముందే నష్టాల పేరుతో వాటిని మూసివేసి ప్రజాధనాన్ని భూస్వాములు కాజేస్తున్నారని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీలను లబ్ధిపొందిన భూస్వాములు కూలీలుగా చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో న్యాయవాదులు రంగరాజు ఆనందరావు, రాయబారపు భిక్షపతి, బండి అనిల్కుమార్, శ్రీనివాసులు, సభ్యులు కార్తీక్, రాజేష్, జానీ, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

యువకుడిని కాపాడిన పోలీసులు



కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

మడికొండ: కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు యత్నించిన యువకుడిని మడికొండ పోలీసులు కాపాడి కౌన్సెలింగ్ నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దుగ్గొండి మండలం మందపల్లి గ్రామానికి చెందిన రాసమల్ల రమేష్ (27) హైదరాబాద్లో ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. దసరా పండుగకు గ్రామానికి వచ్చి ఇంట్లో గొడవపడి మనస్తాపం చెంది సోమవారం రాత్రి ఇంట్లో నుంచి బయటకు వెళ్లి సూసైడ్ నోట్ రాసుకొని, వాట్సాప్ కాల్ ద్వారా ఇంటికి ఫోన్ చేసి చనిపోతున్నానని చెప్పాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన సమాచారంతో మడికొండ - అయోధ్యపురం రైల్వే ట్రాక్ వద్దకు బ్లూకోర్టు పోలీసులు హెడ్కానిస్టేబుల్ రామనాథం, కానిస్టేబుల్ వాసు చేరుకుని యువకుడి ప్రాణాలు కాపాడారు. మంగళవారం ఉదయం యువకుడి కుటుంబ సభ్యులను మడికొండ ఇన్స్పెక్టర్ కిషన్ పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చి వారికి రమేష్ను అప్పగించారు.

సంక్షిప్తంగా

ఆర్థిక సాయంపై బాధితుల హర్షం

ఖిలా వరంగల్: వరద ముంపులో చిక్కి ఆర్థికంగా నష్టపోయిన గుడిసెవాసులకు రూ.10వేల చొప్పున నగదును బాధితుల బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసింది. గుడిసెవాసులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేసిన మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్రావు, మంత్రి కొండా సురేఖ చిత్రపటాలకు వరంగల్ ఉర్సు కరీమాబాద్లోని డీకేనగర్లో మహ్మద్ హసన్ ఆధ్వర్యంలో మంగళవారం పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో వేముల లక్ష్మీనారాయణ గౌడ్, దాసరి నాగరాజు, దేవేందర్, సత్యం, కవిత, లక్ష్మి, శంకర్, రమేష్, సదానందం, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

18న కల్లుగీత కార్మిక సంఘం వార్షికోత్సవం

మడికొండ: ఈనెల 18వ తేదీన హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరగనున్న కల్లుగీత కార్మిక సంఘం వార్షికోత్సవాన్ని విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈమేరకు సంఘం 67వ వార్షికోత్సవ కరపత్రాలను మడికొండలోని మెట్టు రామలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గౌని సాంబయ్య మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో 1957లో సంఘం ఆవిర్భవించిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బుర్ర శ్రీనివాస్, నాయకులు కోతి సాంబరాజు, సారా వెంకటేశం, రాజు, రవి, వేణు, మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

బొడ్రాయికి ప్రత్యేక పూజలు

ఖిలా వరంగల్: వరంగల్ ఫోర్ట్రోడ్డులోని రుద్రమాంబనగర్లో లక్ష్మి, భూలక్ష్మి బొడ్రాయి ప్రథమ వార్షికోత్సవం మంగళవారం జరిగింది. బొడ్రాయి ప్రతిష్ఠాపన కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో వేద పండితుడు భాస్కర్చారి బృందం నేతృత్వంలో గ్రామ దేవత బొడ్రాయికి పూజలు చేశారు. కార్పొరేటర్లు దిడ్డి కుమారస్వామి, బైరబోయిన ఉమ, తదితరులు హాజరై బొడ్రాయిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో అచ్చ వినోద్కుమార్, దామోదర్, సారంపాణి, కొత్తపెల్లి శ్రీనివాస్, వీరభద్రం, రవికుమార్, నాగరాజు, క్రాంతికుమార్, రాజు పాల్గొన్నారు.

దళిత ఫెడరేషన్ ఆవిర్భావ దినోత్సవం

కాశిబుగ్గ: తెలంగాణ దళిత ఫెడరేషన్ (టీడీఎఫ్) ఆవిర్భావ దినోత్సవాన్ని కాశిబుగ్గ జంక్షన్లో మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ప్రొఫెసర్ వినోద్కుమార్ హాజరై జెండా ఎగురవేసి మాట్లాడారు. రాష్ట్రంలోని 59 దళిత కులాలను ఐక్యం చేస్తూ, మూడు ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. టీడీఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు దబ్బెట శ్రీనివాస్, అజయ్, చెరుకు కర్ణాకర్, ప్రేమ్సాగర్, విఘ్నేష్, ఎలీషా, అశోక్, రాజు, రఘుపతి, సురేష్, దిలీప్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

హసన్పర్తి: అనారోగ్యంతో మరణించిన హసన్పర్తి మండలం అర్వపల్లికి చెందిన అంబాల రాజయ్య కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యేలు అరూరి రమేష్, మార్తినేని ధర్మారావు మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ జక్కుల రమేష్, కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, బీజేపీ వరంగల్ పార్లమెంట్ కన్వీనర్ కుమారస్వామి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మారపల్లి రాంచంద్రారెడ్డి పాల్గొన్నారు.

డీఈఓ పద్ధతి మార్చుకోవాలి

కాళోజీ సెంటర్: నూతన ఉపాధ్యాయులకు పాఠశాలలు కేటాయిస్తామని వాయిదా వేసి గందరగోళానికి గురిచేసిన వరంగల్ డీఈఓ పద్ధతి మార్చుకోవాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కదారి భోగేశ్వర్, జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు, పూజారి మనోజ్ పేర్కొన్నారు. నూతన ఉపాధ్యాయుల పక్షాన సమస్యను పరిష్కరించే ప్రయత్నంలో భాగంగా మంగళవారం యూనియన్ నాయకులు వరంగల్ డీఈఓను కలిసినట్లు వారు పేర్కొన్నారు. తమ నాయకులపై నిర్లక్ష్యంగా మాట్లాడిన డీఈఓ ఒంటెత్తు పోకడలు మార్చుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఖాళీల జాబితా వెబ్సైట్లో అందుబాటులోకి తెస్తే వరంగల్ జిల్లాలో మాత్రం డీఈఓ కార్యాలయం జాప్యం చేస్తోందని ఆరోపించారు.

ఆన్లైన్ సట్టా స్థావరంపై టాస్క్ఫోర్స్ దాడి

ఖిలా వరంగల్: ఓ ఇంట్లో రహస్యంగా ఆడుతున్న ఆన్లైన్ సట్టా స్థావరంపై దాడి చేసి రూ.5,100ల నగదును స్వాధీనం చేసుకుని, ఓ మహిళపై కేసు నమోదు చేసినట్లు టాస్క్ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మిల్స్కాలనీ పోలీస్ స్టేషన్ పరిధి మిల్స్కాలనీ క్రిస్టియన్ కాలనీకి చెందిన ఆన్లైన్ సట్టా, మట్కా (ఏజెంట్) జి.శ్రీలత ఇంట్లో రహస్యంగా ఆన్లైన్ సట్టా ఆడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు మంగళవారం మధ్యాహ్నం టాస్క్ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ ఆధ్వర్యంలో ఇన్స్పెక్టర్ శ్రీధర్ గౌడ్ నేతృత్వంలో సిబ్బంది దాడి చేశారు. శ్రీలతను అదుపులోకి తీసుకుని ఆమె నుంచి రూ.5,100ల నగదు, సట్టా చిట్టీలు స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్యల నిమిత్తం మిల్స్కాలనీ ఎస్సై రవీందర్కు కేసు అప్పగించినట్లు టాస్క్ఫోర్స్ ఇన్స్పెక్టర్ శ్రీధర్ గౌడ్ వివరించారు.

ఏపీజే అబ్దుల్ కలాం జయంతి



కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్భాస్కర్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు



హనుమకొండ ములుగురోడ్డులోని ముస్లిం కమ్యూనిటీ సెంటర్లో కలాంకు నివాళులర్పిస్తున్న పలువురు వక్తలు



మాజీ రాష్ట్రపతి, భారతరత్న అవార్డు గ్రహీత ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా కేయూ దూరవిద్య కేంద్రం లోని జర్నలిజం విభాగంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేస్తున్న పాస్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సంగని మల్లేశ్వర్, తదితరులు